సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 15 । మే । 2023



మామిడి.. ధర తడబడి

మామిడి రైతు సిండికేట్ వల్ల ధర లేక నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ ఏడాదైనా పరిస్థితి బాగుంటుందని ముందుకు సాగుతున్నప్పటికీ పరిస్థితుల్లో మార్పు రాలేదు. 8లో



నేటి నుంచి ఈఏపీ సెట్

ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఏలూరు జిల్లాకు సంబంధించి మూడు, పశ్చిమలో ఏడు కేంద్రాలు సిద్ధం చేశారు. 8లో



భగీరథ విగ్రహావిష్కరణ

మునునూరులో సగర సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. నగరుల అభివృద్ధికి కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. 8లో

న్యూస్‌రీల్

తల్లిదండ్రులను దైవంలా భావించాలి



తణుకులో అమ్మ సూర్యకాంతమ్మతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : మదర్స్ డేను పురస్కరించుకుని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తన మాతృమూర్తి సూర్యకాంతమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం తల్లికి పండ్లు, మిఠాయిలు తినిపించారు. ప్రతి ఒక్కరు తల్లిదండ్రులను దైవంలా భావించి వారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

నేడు ఎమ్మెల్సీగా వంక ప్రమాణ స్వీకారం

తణుకు టౌన్: ఉమ్మడి జిల్లా నుంచి స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందిన వంక రవీంద్రనాథ్ ఈ నెల 15న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తెలిపారు. సోమవారం ఉండవల్లిలోని శాసన మండలి కార్యాలయంలో ఎమ్మెల్సీగా వంక రవీంద్రనాథ్ ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం : మండలంలోని కామవరం అటవీప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతోపాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు లారీలు, మినీవ్యాన్‌లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో తరలివచ్చి మంగమ్మ తల్లికి పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు ఈ ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి అనుమతి ఇవ్వడంతో అధిక సంఖ్యలో భక్తులు ఉదయం నుంచి భక్తుల తాడికి ఎక్కువగా ఉంది.

సీఎం దృష్టికి రజకుల సమస్యలు



రజక మహిళలతో రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న

ఉంగుటూరు : రజకులకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని ముఖ్యమంత్రిని అడిగానని రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న తెలిపారు. ఆదివారం గొల్లగూడెం వచ్చిన ఆయన మాట్లాడుతూ రజకుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సీఎం జగన్ ఒక కమిటీ వేశారని, ఇప్పటికి కమిటీ రెండుసార్లు సమావేశమైందన్నారు. సమస్యలు పరిష్కారం అవగానే ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు పాదయాత్ర నిర్వహిస్తానని, రజకులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అనుకూలంగా మలుస్తానని అన్నారు.

యంత్రాలతో కోసిన గడ్డికి క్రేజ్

- కట్టలు కట్టించి వినియోగిస్తున్న రైతులు
- పశువులకు త్వరగా జీర్ణమవుతుంది: పశు సంవర్ధక అధికారులు

సాక్షి, భీమవరం: వరిసాగులో యంత్రాల ప్రాధాన్యం పెరిగింది. ఇప్పుడు దాదాపు 95 శాతానికి పైగా పంటను యంత్రాలతోనే కోయిస్తున్నారు. సాగులో భూమిని దమ్ముచేయడం నుంచి నాట్లు వేయడానికి, పురుగు మందుల పిచికారీ, పంట మాసూళ్లు, వరి గడ్డి కట్టలు కట్టడానికి సైతం యంత్రాలనే వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దమొత్తంలో సబ్సిడీపై యంత్రాలకు రుణాలు అందచేయడంతో గ్రామాల్లోని రైతులు కమిటీలుగా ఏర్పడి వివిధ రకాల యంత్రాలను కొనుగోలు చేస్తున్నారు.

యంత్రాలతో మాసూళ్ల వల్ల ఎండుగడ్డికి కొరత

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 4.6 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా దాళ్వా సీజన్‌లో పంట మాసూళ్లకు యంత్రాలను ఉపయోగించడం పరిపాటి. యంత్రంతో పంట మాసూళ్లు చేయడం వల్ల వరి గడ్డి ముక్కలు ముక్కలుగా మారిపోతుంది. గతంలో ముక్కలుగా మారిన గడ్డి పశువులకు మేతగా వేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు గడ్డిని చేనులోనే తగలబెట్టేవారు. దీంతో పశువులను పెంచే రైతులకు వరి ఎండుగడ్డి కొరత ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పండేవారు. ఇతర జిల్లాల నుంచి గడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గడ్డి కొరత కారణంగా ఎకరం గడ్డి సుమారు రూ.6 వేలు పలుకుతోంది. ఇలాంటి సమయంలో పశుసంవర్ధకశాకాధికారులు వరికోత యంత్రాలతో మాసూళ్లు చేసినా గడ్డి పశువులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ముక్కలైన గడ్డి పశువులు తినడం వల్ల త్వరితగతిని జీర్ణం అవుతుందని రైతులకు అవగాహన కల్పించారు. రైతులు యంత్రాలు మాసూళ్లు చేసిన వరి పంట గడ్డిని పశువులకు మేతగా ఉపయోగిస్తున్నారు.



వరి చేలలో గడ్డిని కట్టలు కడుతున్న యంత్రం

ఉమ్మడి జిల్లాలో సుమారు 10 లక్షల పశువులు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో పాడి రైతులను ప్రోత్సహించడంతో రైతులు పశువులు పెంచడానికి మక్కువ చూపుతున్నారు. జిల్లాలోని పశుసంవర్ధకశాఖ నాలుగు డివిజన్ల పరిధిలో సుమారు 4 లక్షలకుపైగా ఆవులు, సుమారు 6 లక్షల గేదెలు ఉన్నట్లు అంచనా. పశువులు పెరగడంతో వరి గడ్డి కోసం ఇతర జిల్లాలకు వెళ్లి పెద్దమొత్తంలో ఖర్చు చేయలేక రైతులు వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన వరిగడ్డిని పశువులకు దాణాగా ఉపయోగిస్తున్నారు. గడ్డి కట్టలు కట్టడానికి యంత్రాలను ఉపయోగిస్తున్నారు. చేలలోని గడ్డిని ప్రత్యేక యంత్రం ద్వారా కట్టలు కట్టించి ట్రాక్టర్లతో గట్టుకు చేర్చి గడ్డివాములుగా వేస్తున్నారు. యంత్రం ద్వారా కట్టలు కట్టడానికి ఒక్కో కట్టకు రూ.35 వసూలు చేస్తున్నారు. దీంతో యంత్రం ద్వారా ఎకరం గడ్డి ఒబ్బిడి చేయడానికి సుమారు రూ.2 వేలు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. ఇతర జిల్లాల్లో గడ్డి కొనుగోలుచేసేకంటే స్థానికంగా ఉన్న గడ్డిని ఒబ్బిడి చేసుకోవడమే మేలంటున్నారు.



వీరవాసరం మండలం పంజావేమవరంలో యంత్రంతో వరి గడ్డిని కట్టలు కట్టిన దృశ్యం


వరి యంత్రాల వల్ల గడ్డికి కొరత



వరి పంట మాసూళ్లకు వరి కోత యంత్రాలు ఉపయోగించడం వల్ల వరిగడ్డికి కొరత ఏర్పడి పశువులు పెంపకం కష్టమైంది. దీంతో గతంలో పాలు కోసం పశువులను మేపగా నేడు పాలు కొనుగోలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

– కావకాయల సత్యనారాయణ, రైతు, పంజా వేమవరం

యంత్రాలతో కోసిన గడ్డిని వినియోగిస్తున్నాం



ఇంతకుముందు వరికోత యంత్రాలతో మాసూళ్లచేసి వరి గడ్డి పశువులు దాణాగా ఉపయోగపడదని మేపే వాళ్లం కాదు. గడ్డికి తీవ్ర కొరత ఏర్పడడంతో యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన పంటలోని గడ్డిని మరో యంత్రంతో కట్టలు కట్టించి వాముగా వేసి పశువులకు ఉపయోగిస్తున్నాం.

– గనిశెట్టి మధుబాబు, కాళ్ల

మేధాశక్తి పెరిగేందుకు

చెస్ తోడ్పాటు



భీమవరంలో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో దాసి రాజు

సాక్షి, భీమవరం : చెస్ క్రీడతో మేధాశక్తి పెరుగుతుందని తద్వారా విద్యార్థుల ఉన్నత విద్యకు ఎంతో తోడ్పడుతుందని భీమవరం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సీనియర్ చెస్ చాంపియన్‌షిప్-2023 పోటీలు భీమవరం ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో ఆదివారం ప్రారంభించిన సందర్భంగా ఆర్డీవో రాజు మాట్లాడారు. మన ప్రాంతంలోని చదరంగం క్రీడాకారులు అగ్రస్థానంలో ఉన్నారని, తల్లిదండ్రులు పిల్లలను మరింత ప్రోత్సహించి చదరంగంలో శిక్షణ ఇప్పించి బాలమేధావులుగా తీర్చిదిద్దాలన్నారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో గెలుపొందిన నలుగురు విజేతలు మే 26 నుంచి నాలుగు రోజుల పాటు తిరుపతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి గమిని రవి పవన్‌కుమార్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు జూలూరి వెంకటేష్, సికే సురేష్ జైన్, మైలాపురి మురళి, అల్లు శ్రీనివాస్, పెదపాటి రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





కొండపై కూల్.. కూల్..

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి వస్తున్న భక్తులు భానుడి భగభగలకు అల్లాడిపోతున్నారు. అయితే భక్తులకు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు దేవస్థానం అధికారులు పలు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆలయంలోను, అలాగే తూర్పు రాజగోపుర ప్రాంతం నుంచి జంట గోపురాల ప్రాంతం వరకు పీచు మ్యాట్‌లు ఏర్పాటు చేశారు. అలాగే కూల్ పేయింట్ వేశారు. భక్తులు కాళ్లు కాలకుండా వీటిపై నడుచుకుంటూ వెళుతున్నారు. పీచు మ్యాట్‌లను దేవస్థానం సిబ్బంది నిరంతరాయంగా తడుపుతూ భక్తులకు ఉపశమనాన్ని కలిగిస్తున్నారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ల వద్ద కూలర్లు ఏర్పాటు చేశారు.

– ద్వారకాతిరుమల

వేసవి శిబిరాల్లో ఉల్లాసంగా..

- జిల్లాలో విద్యార్థులకు ఆటల్లో శిక్షణ
- నెలాఖరు వరకూ ఉదయం, సాయంత్రం సాధన

ఏలూరు రూరల్: పాఠశాలలకు వేసవి సెలవులతో ఇప్పుడు పిల్లలంతా ఆటలపై ఆసక్తి చూపుతున్నారు. పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఆటలతో సేద తీరుతున్నారు. చదువు ఒత్తిడి నుంచి పిల్లలను విముక్తుల్ని చేసేందుకు తల్లిదండ్రులు సైతం పిల్లల్ని ఆటల వైపు మళ్లిస్తున్నారు. పిల్లలను మానసికంగా, శారీరకంగా దృఢంగా చేసేందుకు ఆటలు ఎంతో ఉపకరిస్తాయి. అందుకు వేసవి సెలవుల్ని సద్వినియోగం చేసుకుంటే మంచిది.

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ

వేసవిలో పిల్లలకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శిబిరాలు ఏర్పాటుచేసింది. గత ఏడాది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించిన 50 శిబిరాలను ఈ ఏడాది సైతం కొనసాగిస్తోంది. జిల్లా చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు, సెట్‌వెల్ సీఈఓ మెహర్రాజ్ శిబిరాల నిర్వహణ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పలువురు పీఈటీ, పీడీ, సీనియర్ క్రీడాకారులచే శిబిరాలు నిర్వహిస్తోంది. మే నెలాఖరు వరకూ నిర్వహించే ఈ శిబిరాల్లో పిల్లలు ఆటలు నేర్చుకునేందుకు బాల్స్, హాకీ స్టిక్స్, నెట్స్ తదితర క్రీడాపరికరాలు ఉచితంగా అందిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా శిక్షణ అందిస్తుంది. శిక్షణ పూర్తి అయిన తర్వాత పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తారు.

అసోసియేషన్ల ఆధ్వర్యంలో శిక్షణ

ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఇండోర్ స్టేడియం శిక్షణ శిబిరాలకు ప్రధాన కేంద్రంగా మారనున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న కోచ్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, తైక్వాండో, స్కేటింగ్‌లో శిక్షణ కొనసాగనుంది. ఏలూరు బిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ గణేష్ పిల్లలకు శిక్షణ అందిస్తున్నారు. ఇందుకోసం కొంత ఫీజు చెల్లించాల్సి ఉంది. మరోపక్క జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఏలూరు, కొవ్వూరు, భీమవరంలో శిక్షణ శిబిరాలు ఏర్పాటుచేయనుంది. ఇదే కోవలో బాస్కెట్‌బాల్, చెస్, కరాటే, కుంగ్‌ఫూ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నిస్ అసోసియేషన్లు సైతం ఏలూరు, కొవ్వూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం తదితర నగరాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేశాయి. వీటితో పాటు మున్సిపల్ నగర కార్పొరేషన్ అధికారులు సైతం నగర పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులచే శిబిరాలు ఏర్పాటు చేసే అవకాశం కనిపిస్తోంది.



నూజివీడు సమ్మర్ క్యాంప్‌లో సాధన చేస్తున్న చిన్నారులు



ఏలూరు స్విమ్మింగ్‌పూల్‌లో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరం

శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశాం



ఏటా వేసవిలో నిర్వహించే శిక్షణ శిబిరాల వల్ల పెద్ద సంఖ్యలో పిల్లలు ఆటలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. ఈ ఏడాది సైతం జిల్లాలో వేసవి శిక్షణ శిబిరాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో శిబిరాలు ప్రారంభించాం. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆసక్తి గల పీడీ, పీఈటీ, సీనియర్ క్రీడాకారుల సహకారంతో క్యాంప్ ఏర్పాటుచేస్తున్నాం. ఇప్పటికే క్రీడా పరికరాలు సిద్ధం చేశాం.

– బి.శ్రీనివాసరావు, జిల్లా చీఫ్ కోచ్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

శిక్షణ కాలంలో పిల్లలు శక్తిహీనులు కాకుండా మంచి పౌష్టికాహారం అందించాలి. ఎండ వేడిమి నుంచి కాపాడేందుకు శక్తి ఇచ్చే లిక్విడ్స్ అందుబాటులో ఉంచాలి. సాధనకు అనుకూలమైన పల్చటి, మెత్తటి స్పోర్ట్స్ డ్రెస్ ధరింపచేయాలి. అనుభవజ్ఞులైన కోచ్‌లను ఎంపిక చేసుకోవాలి.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

ఏలూరు డీఎస్పీగా ఈ.శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

ఏలూరు టౌన్: ఏలూరు సబ్ డివిజన్‌లో ప్రజలకు అత్యంత మెరుగైన, పారదర్శక రీతిలో సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు అన్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో ఏలూరు డీఎస్పీగా ఆయన నియమితులయ్యారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఏలూరు సీసీఎస్ డీఎస్పీగా పనిచేస్తూ, ఏలూరు ఇన్‌ఛార్జ్ డీఎస్పీగా అదనపు బాధ్యతలు చేపడుతున్న జీవీఎస్ పైడేశ్వరరావు నూతన డీఎస్పీ శ్రీనివాసులును సాదరంగా ఆహ్వానించి, బాధ్యతలు అప్పగించారు. ఆయన తాజాగా పులివెందులలో పనిచేస్తూ బదిలీపై ఏలూరుకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని, బాధితులకు సత్వరమే న్యాయం చేసేందుకు సిబ్బంది మరింత నిబద్ధతతో పనిచేయాలని చెప్పారు. జూదం, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడతామని స్పష్టం చేశారు.

చంద్రబాబు ఫ్లాప్ షో

- అసత్యాలు...అభూత కల్పనలు
- లేనిది ఉన్నట్లు... ఉన్నది లేనట్లు చూపించే ప్రయత్నం
- రైతులు పట్టించుకోకపోవడంతో టీడీపీ సానుభూతిపరులతో డ్రామాలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: చంద్రబాబు జిల్లా పర్యటన ఫ్లాప్ షోగా ముగిసింది. కోసేసిన వరి పొలాల పరిశీలన.. పక్క మండలాలు, పక్క నియోజకవర్గాల నుంచి తీసుకొచ్చిన పాడైన ధాన్యాన్ని పరిశీలించినట్లు హహంగామా చేయడం తప్ప పర్యటన అంతా డ్రామాను తలపించింది. రైతు పోరుబాట పేరుతో తణుకు నియోజకవర్గంలో చంద్రబాబు 12 కిలోమీటర్లు పాదయాత్ర చేసి బహిరంగ సభలో మాట్లాడారు. పాదయాత్రకు, బహిరంగసభకు జనాలు పలచన కావడంతో టీడీపీ నేతల పరువు పోయింది. జిల్లాలో మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ, తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించి ఆ మేరకు కొనుగోలు నిర్వహిస్తున్నారు. నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం రోజుల వ్యవధిలో జరిగాయి. ఇవేవీ జరగలేదని అభూత కల్పనలతో.. అసత్య ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లానుకున్న టీడీపీ వ్యూహానికి అన్నదాతలే చెక్‌పెట్టారు.

చంద్రబాబును పట్టించుకోని రైతులు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు గత వారం రోజుల వ్యవధిలో మూడు రోజులు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించారు. ఈ నెల 5న ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం నాచుగుంట, పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం మండలం నందమూరు, తణుకు నియోజకవర్గం తణుకు మండలంలో చంద్రబాబునాయుడు పర్యటించి రైతులను ప్రభుత్వం ఆదుకోవడం లేదని, ఇష్టానుసారంగా విమర్శలు గుప్పించారు. ఈ నెల 11న తణుకు నియోజకవర్గంలోని ఇరగవరం మండలం నుంచి తణుకుకు రైతు పోరుబాట పేరుతో 12 కిలోమీటర్ల పాదయాత్ర, తణుకులో బహిరంగసభ నిర్వహించారు. మొత్తం రెండు పర్యటనలు మూడు రోజుల పాటు సాగినప్పటికీ రైతులు మాత్రం ఎక్కడా చంద్రబాబుకు కనిపించని పరిస్థితి. ప్రతి చోట నేను చెప్పేది వినండి.. నేను మాట్లాడేదానికి అడ్డం చెప్పవద్దంటూ గదుముతూ.. మరీ ప్రతి ఊరిలోనూ ప్రభుత్వంపై బురద చల్లడమే ఎజెండాగా పెట్టుకుని యాత్ర సాగించారు. అయినా జిల్లాలో మాత్రం స్పందన లేదు. ఈ రబీ సీజన్‌లో ఏలూరు జిల్లాలో 79,229 ఎకరాల విస్తీర్ణంలో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రాగా ఇంతవరకు 1,74,515 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 2,50,000 ఎకరాల విస్తీర్ణంలో 6.40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి లక్ష్యం కాగా ఇంతవరకు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అకాల వర్షం వల్ల మూడు, నాలుగు రోజుల పాటు కొనుగోళ్లకు విఘాతం కలిగినప్పటికీ యుద్ధప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేశారు. ఈ క్రమంలో రైతులను ప్రభుత్వం ఆదుకోవడం లేదని పదే పదే విమర్శలు గుప్పించారు.



తడిసిన ధాన్యాన్ని కుప్పగా వేసేందుకు వచ్చిన నేతలను అడ్డుకున్న పోలీసులు(ఫైల్)

తెలుగు తమ్ముళ్ల పాట్లు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో పెద్దగా సమస్యలు లేవని జిల్లా పార్టీ ముఖ్యులు రాష్ట్ర కార్యాలయానికి చెప్పినా ఉద్దేశపూర్వకంగానే జిల్లాలో పర్యటన ప్రకటించడంతో స్థానిక నేతలు జనసమీకరణకు పడరాని పాట్లు పడ్డారు. ప్రధానంగా తణుకు ముఖ్య నాయకులు పరిస్థితి మరీ దారుణం. తడిచిన ధాన్యం అందుబాటులో లేద. చంద్రబాబు పర్యటన 12 కిలోమీటర్ల పరిధిలో ఇరగవరం, గోటేరు, కే.ఇల్లిందలపర్రులో ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరిగాయి. పదుల ఎకరాల్లోనే స్వల్పంగా పంట నష్టం వాటిల్లింది. దీంతో తణుకు టీడీపీ ఇన్‌చార్జ్ ఆరిమిల్లి రాధాకృష్ణ మూడు రోజులు మండలాల్లో తిరిగి రైతులందరినీ చంద్రబాబు కార్యక్రమానికి తీసుకువచ్చేలా మండల నేతలకు ఆదేశాలు ఇచ్చారు. దువ్వ, పాలకొల్లు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి తడిచిన ధాన్యాన్ని పోగుచేసి ఎవరికీ అనుమానం రాకుండా దానిపైన ఎండుగడ్డి కప్పి చంద్రబాబు పర్యటించే మార్గంలో రోడ్డుపై కుప్పగా పోశారు. దీన్ని పోలీసులు, స్థానిక రైతులు గుర్తించి వారిని ప్రశ్నించి రోడ్డుపై కుప్పగా పోసిన ధాన్యాన్ని మళ్ళీ ట్రాక్టర్‌లో లోడు చేయించి అక్కడ నుంచి పంపించారు. దీంతో సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పోలీసులపై హడావిడి చేసి 5 నిమిషాలు పాటు హైడ్రామా చేసి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. రామానాయుడు, ఆరిమిల్లి రాధాకృష్ణలు రైతులు రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందని హడావిడి చేసి సర్దుకున్నారు.

బహిరంగ సభ వెలవెల

చంద్రబాబు పర్యటన కోసం ముందస్తుగా చేసిన ఏర్పాట్లు ఫ్లాప్ అవడంతో కోతలు పూర్తయిన పొలాల్లోకి దిగి చంద్రబాబునాయుడు ఫొటో షూట్ చేసుకుని పాదయాత్ర కొనసాగించారు. వేలాది మందితో భారీగా తణుకులో బహిరంగసభను నిర్వహించేలా ప్లాన్ చేశారు. తణుకు, పాలకొల్లు, ఉండి, తాడేపల్లిగూడెం నాలుగు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ క్యాడర్‌ను కూడా తరలించారు. అయితే చంద్రబాబు సభకు భారీగా తరలివచ్చిన క్యాడర్, చంద్రబాబు తణుకు చేరుకోకముందే వెళ్ళిపోవడంతో సభ కూడా పూర్తిగా ఫ్లాప్‌షోగా మిగిలిపోయింది.

ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఆదివారం కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువ జాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. పంచామృతాలతో అభిషేకాలు, లక్ష తమలపాకులతో విశేష పూజలు, ప్రత్యేక హోమాలు వంటి పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు, వేద పండితులు ఘనంగా నిర్వహించారు. 40 వేల మంది భక్తులు, హనుమాన్ దీక్షాధారులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ.2,30,370 వచ్చినట్లు, 5 వేల మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈవో తెలిపారు.

వైభవంగా హనుమంత వాహన సేవ

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరిలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం 8 గంటలకు నిత్యహోమం, నీరాజనం, తీర్థప్రసాదగోష్టి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవెంకటేశ్వరస్వామిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు ఉభయధారులుగా వాసవి శాయి నగేష్, వెంకట వరలక్ష్మి దంపతులు, మానికల వెంకటేశ్వరరావు, దుర్గ దంపతులు వ్యవరించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. సాయంత్రం పురవీధుల్లో తిరువీధి ఉత్సాహం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు పి.జగపతిరాజు, దండు దనరాజు, రెడ్డిరంగప్రసాద్, బురుగుమిల్లి రవీంద్రర్ పాల్గొన్నారు.



స్వామి వారికి లక్ష తమలపాకుల పూజలు చేస్తున్న దృశ్యం





పారిజాతగిరిలో వెంకటేశ్వరస్వామిని సుందరంగా అలంకరించిన దృశ్యం, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడికి హనుమంత వాహన సేవ

క్లుప్తంగా

వృద్ధుడి అదృశ్యం

ఆగిరిపల్లి: మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.చంటిబాబు ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సగ్గూరుకు చెందిన తాణంకి రాజారత్నం (80) ఈ నెల 11 మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మతిస్థిమితం లేని స్థితిలో చేతిలో సంచితో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెదికినా ఆచూకీ దొరక్క పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టినరోజు నాడే మృత్యువాత


ఏకేష్ మృతదేహం

కైకలూరు (కలిదిండి): పుట్టినరోజు నాడే రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాతకు గురై కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన చాబత్తిన ఏకేష్ (24) డీజే సౌండ్ సిస్టం పనులు చేస్తుంటాడు. శనివారం ఈ పని కోసం ద్విచక్ర వాహనంపై భీమవరం వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి తిరిగి వస్తుండగా గుర్వాయిపాలెం పెట్రోల్ బంక్ సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు బోరున విలపించారు. సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా రోడ్డుపై లారీని నిలుపుదల చేసిన వారిపై కలిదిండి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

నేటి నుంచి ఈఏపీ సెట్

- ఏలూరు జిల్లాలో 3, పశ్చిమలో 7 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 18,300 మంది అభ్యర్థులు
- ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎంసెట్ పరీక్షలను ఏపీ ఈఏపీ సెట్ పేరుతో నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈఏపీ సెట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 19వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు, 22, 23 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో గతేడాది 61 శాతం మంది ఉత్తీర్ణులు కాగా, ఈ ఏడాది 72 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో ఈఏపీ సెట్ పరీక్షలకు గత ఏడాది కంటే దాదాపు 10 శాతం మంది విద్యార్థులు అదనంగా రిజిస్టర్ చేసుకున్నారు. జేఎన్‌టీయూఏ (అనంతపురం) నిర్వహించే ఈఏపీ సెట్ పరీక్షలకు ఏలూరు జిల్లాకు సంబంధించి ఏలూరు నగరంలో మూడు, పశ్చిమ గోదావరికి సంబంధించి ఏడు కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. మొత్తం 18,300 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈఏపీ సెట్ పరీక్షల్లో ఇంటర్ పరీక్షల్లో వచ్చిన మార్కులకు 25 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు.

రెండు షిఫ్టుల్లో పరీక్షలు

ఈఏపీ సెట్ పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఒక షిఫ్ట్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో షిఫ్టులో పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులను పరీక్షా సమయానికంటే రెండు గంటలు ముందుగానే ఆయా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభ సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. పరీక్షలో 160 మార్కులకు 160 బిట్లు ప్రశ్నలుగా ఇస్తారు. వీటిని మూడు గంటల వ్యవధిలో పూర్తి చేయాలి. ఈ పరీక్షల్లో 40 మార్కులను పాస్ మార్కులుగా నిర్ణయించగా, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు పాస్ మార్కు లేకుండా.. వారికి వచ్చిన మార్కుల ఆధారంగా వారి ర్యాంకును నిర్ణయిస్తారు.

పరీక్షా కేంద్రాలు ఇవే..

ఏలూరు జిల్లాలో.. ఏలూరులోని సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సిద్ధార్థ క్వెస్ట్ కళాశాల.

పశ్చిమగోదావరి జిల్లాలో.. భీమవరంలోని విష్ణు కాలేజ్ ఫర్ విమెన్, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, డీఎన్‌ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెంలో వాసవి ఇంజినీరింగ్ కళాశాల, శశి ఇంజినీరింగ్ కళాశాల, నరసాపురంలో స్వర్ణాంధ్ర కళాశాల.

మార్కుల వెయిటేజీతో ఊరట

ఈఏపీ సెట్ పరీక్షలకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఏర్పాటు చేసిన 10 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 18,300 మంది హాజరు కానున్నారు. వీరిలో 12,700 మంది ఇంజినీరింగ్, 5,600 మంది అగ్రికల్చర్, ఫార్మసి కోర్సులకు రిజిస్టర్ చేసుకున్నారు. ఈ ఏడాది ఈఏపీ సెట్ పరీక్షల్లో ఇంటర్ పరీక్షల్లో వచ్చిన మార్కులకు 25 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. 2019వ సంవత్సరంలో ఎంసెట్ పరీక్షలకు చివరిసారిగా వెయిటేజీ ఇవ్వగా, 2020 నుంచి 2022వ సంవత్సరం వరకు కోవిడ్ కారణంగా ఈఏపీ సెట్‌లో ప్రభుత్వం వెయిటేజీని తొలగించింది. ఈ ఏడాది నుంచి వెయిటేజీని పునరుద్ధరించడం విద్యార్థులకు ఊరటనిస్తోంది. ఈ ఏడాది ఒక్కో షిఫ్టుకు ఒక్కో ప్రశ్నపత్రం ఇచ్చి డిఫికల్టి స్థాయి ఆధారంగా నార్మలైజేషన్ చేసి ఇంటర్ వెయిటేజీని కలిపి ర్యాంకులు ప్రకటించనున్నారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించం



పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు. అడ్మిట్ కార్డు, ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు అటెస్ట్ చేయించిన కుల ధ్రువీకరణ పత్రం, ఒక పెన్ మాత్రమే తీసుకురావాలి. రఫ్ వర్క్ కోసం తెల్లకాగితాన్ని పరీక్షా కేంద్రంలోనే ఇస్తారు. ప్రతి విద్యార్థి ఫొటో, వేలిముద్ర తీసుకుని హాల్ టికెట్‌పై ఉన్న బార్‌కోడ్‌ను స్కాన్ చేసి సీటును కేటాయిస్తారు. దీనికి కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున విద్యార్థులు 90 నిమిషాల నుంచి 120 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.

– పి.బాలకృష్ణ ప్రసాద్, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ చీఫ్ సూపరింటెండెంట్

యూత్ బాస్కెట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక


జిల్లా బాలికల జట్టు


జిల్లా బాలుర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఏలూరు రూరల్: అల్లంపల్లి మాంటిస్సోరి హైస్కూల్‌లో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు పాల్గొంటాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలికల జట్టును ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాలలో, బాలుర జట్టును మార్టేరు ఎస్‌వీజీ జెడ్పీహెచ్ స్కూల్ ఆవరణలో ఎంపిక చేశామని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

బాలుర జట్టు

ఎస్.సందీప్‌కుమార్, ఎస్.కిషోర్, ఎ.ఈశ్వర్‌తేజ, ఎన్.ప్రభుకుమార్, ఎం.సోమశేఖర్, ఎం.సాంబసూర్య, జి.అశోక్, టి.రంజిత్‌కుమార్, జీజే అనిష్, ఈ చార్లెస్‌వెస్లీ, బి.రాఖేష్, వి.ధర్మేంద్ర

బాలికల జట్టు

వి.యామిని, పి.జయశ్రీ, పి.నందిని, ఎస్.రేణుక, జి.పూజిత, ఎం.గాయత్రి, డి.సాయి భవాని, బి.దేవిశ్రీ, ఎ.రుత్విక, ఎస్ఎస్ భవాని, ఏబీఎం దీక్షిత, జి.పావని, డి.అమృత, జి.ఏసమ్మ, టి.శ్రావణి

గడపగడపకు సంక్షేమం


పాలకొల్లు అర్బన్: పాలకొల్లు 9వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళ సమస్య వింటున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

చిటికెన వేలు గోరుపై కాటన్ దొర



ఆనకట్టలను నిర్మించి ఎన్నో లక్షల ఎకరాలకు సాగునీటిని అందించిన ఘనత సర్ ఆర్థర్ కాటన్‌కే దక్కుతుంది. పూర్వ ఉభయగోదావరి జిల్లాల ప్రజలు ఆయనను కాటన్ దొర అంటూ ఎంతో అభిమానంతో పిలుచుకుంటారు. ఏలూరుకు చెందిన సూక్ష్మకళాకారుడు మేతర సురేష్‌బాబు అగ్గిపుల్లపై సర్ ఆర్థర్ కాటన్ చిత్రాన్ని చెక్కి చిటికెన వేలు గోరుపై నిలిపి ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ సోమవారం సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చెప్పారు.

– ఏలూరు (టూటౌన్)

ఈ జాగ్రత్తలతో వనామీ సాగులో లాభాలు


ఎల్‌ఎల్‌ఎన్ రాజు, ఏడీ, మత్స్యశాఖ, భీమవరం

భీమవరం అర్బన్: గత వారం రోజులుగా ఎండలు తీవ్రంగా ఉన్నాయని వనామీ రొయ్య పెంచే రైతులు అప్రమత్తంగా లేకపోతే నష్టాలు తప్పవని మత్స్యశాఖ ఏడీ ఎల్‌ఎల్‌ఎన్ రాజు హెచ్చరించారు. భీమవరంలోని మత్స్యశాఖ కార్యాలయంలో ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. డాలర్ల పంటగా చేస్తున్న వనామీ సాగులో తక్కువ సమయంలో అధిక లాభాలు రావడంతో జిల్లాలో సుమారు 35 వేల ఎకరాలలో వనామీ రొయ్య పెంపకం చేస్తున్నారన్నారు. రొయ్యకు వాతావరణం అనుకూలించడంతో వనామీ రొయ్యను పెంచుతున్నారన్నారు. అధిక ఎండలలో రైతులు జాగ్రత్తలను తీసుకుంటే వనామీ పెంపకంలో పెట్టుబడులు పోను లాభాలు గడించవచ్చని ఎల్‌ఎల్‌ఎన్ రాజు వివరించారు.

- రొయ్యల చెరువు 5 అడుగుల వరకు నీరు ఉండేటట్లు చూసుకోవాలి. లేకుంటే ఎండ వేడిమికి చెరువు ఉపరితల నీరు వేడెక్కి రొయ్యలు మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి
- ఎండకు నీటి ఉపరితలం మీద రెండు అడుగుల వరకు వేడెక్కుతుంది. దీనిని నివారించాలంటే నిత్యం ఏరియేటర్లను తిప్పాలి
- ఎండలకు రొయ్యలు మేత ఎక్కువగా తింటాయి. అవి తిన్నంత పెడితే రాత్రి ఒత్తిడికి గురై చనిపోయే అవకాశాలు ఎక్కువ
- చెరువు నీరు ఎండలకు ఆవిరై నీటి మట్టం తగ్గుతుంది. బ్యాక్టీరియా లేని నీటిని తరచూ అవుట్‌లెట్ ద్వారా నింపాలి
- వేసవిలో ఎండలకు చెరువులో మినరల్ క్రాస్ అవడం, మందులు సరిగా పనిచేయకపోవడంతో రొయ్యలకు బెండ్లు వచ్చే ప్రమాదం ఉంది. దీనిని నివారించేందుకు టెక్నీషియన్ సలహా మేరకు మేతల్లో, చెరువు నీటికి కొన్ని మందులు చల్లాలి
- వారానికి కొకసారి నీటి పరమాణువులైన పీహెచ్, అమ్మోనియా, నైట్రేట్, తదితర వాటిని అదుపులో ఉంచేలా రైతులు చర్యలు తీసుకోవాలి.

పురుగుమందు తాగిన తండ్రీకొడుకు

- కుమారుడి మృతి.. అపస్మారక స్థితిలో తండ్రి
- అప్పుల విషయమై గొడవపడి మనస్తాపంతో..


సూర్యనారాయణరాజు మృతదేహం

భీమడోలు: కౌలుకు సాగు చేస్తున్న పొలాల కోసం చేసిన అప్పులపై తండ్రీకొడుకు గొడవపడి ఆవేశంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో కుమారుడు మృతి చెందగా, తండ్రి అపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్లితే.. పూళ్ల పంచాయతీ శివారు సాయన్నపాలెంకు చెందిన తండ్రీకొడుకులు యార పుత్తూరి నాగరాజు, సూర్యనారాయణరాజు (35) ఉంగుటూరు మండలం కైకరం లోని పలు రైతులకు చెందిన 21 ఎకరాల వ్యవసాయ భూమిని 15 ఏళ్లుగా కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం వ్యవసాయం నిమిత్తం తాము చేసిన అప్పులు విషయంలో ఒకరినొకరు దూషించుకుని ఆ ఆవేశంలో ఇంట్లో ఉన్న పురుగుమందు తాగారు. ఈ విషయాన్ని కుమార్తె సత్యనాగదేవికకు ఫోన్‌లో తెలియజేశారు. ఆమె బంధువుల సహాయంతో అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరిని అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొడుకు సూర్యనారాయణరాజు మృతి చెందగా, తండ్రి నాగరాజు అపస్మారక స్థితిలో ఉన్నాడు. కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేశారు. మృతుని భార్య కొన్నేళ్లుగా వారి అమ్మ ఇంట్లో ఉంటోంది. నాగరాజు భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందింది. కుమార్తెకు వివాహం చేశారు. పెద్ద కుమార్డు సత్యనారాయణరాజు భీమవరంలో రొయ్యల చెరువులపై కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

తీరం కళకళ


కేపీపాలెం బీచ్‌కు తరలివచ్చిన సందర్శకులు

కేపీపాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు భారీగా తరలిరావడంతో బీచ్ రోడ్డు కిటకిటలాడింది. వాతావరణం అహ్లాదకరంగా ఉండటంతో సముద్రస్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని వెంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండరంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించారు.

- మొగల్తూరు

ముసునూరులో భగీరథ విగ్రహావిష్కరణ


భగీరథ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కర్నాటి రాంబాబు

ముసునూరు: సగర జాతి ఐక్యతతో అభివృద్ధిని సాధించాలని విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు అన్నారు. ముసునూరులో స్థానిక సగర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం సగర సంఘ జిల్లా నేత తాడిశెట్టి గోపీరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సగరులను బీసీ-డి నుంచి బీసీ-ఎలోకి మార్చేందుకు అందరూ భగీరథ పట్టుదలతో కృషి చేయాలన్నారు. సగర జాతి అభివృద్ధి సాధనకు జాతి యవత్తూ అక్షరాస్యత సాధించాలని సూచించారు. దీని కోసం సగరులు తమ పిల్లలను పట్టుదలతో చదివించి, వారిని తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమించాలని సూచించారు. రాష్ట్ర సగర ఫెడరేషన్ మాజీ చైర్మన్ సాదరబోయిన ఏడుకొండలు బగీరథ జీవిత చరిత్ర, సగర వంశావళి పూర్వజుల ప్రాశస్త్యాన్ని సుదీర్ఘంగా వివరించారు. సగర సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు టి.సంపతరావు, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహారావు, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, రెడ్డి రాంబాబు, ఏడుకొండలు, యూత్ అధ్యక్షుడు ఇబ్బా నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు డా.వరికూటి ప్రతాప్, ఎంపీపీ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీ రాజానాయన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, సర్పంచ్‌లు కె.విజయలక్ష్మి, పేరం కృష్ణ పాల్గొన్నారు.

అనకాపల్లిలో ఏలూరు జిల్లా వాసి మృతి

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- మరో ఐదుగురికి గాయాలు


అనకాపల్లిటౌన్ : రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందగా అతని కుటుంబ సభ్యులు ఐదుగురు గాయపడ్డారు. పట్టణ జాతీయ రహదారి నూకాంబిక ఆర్చి వద్ద ఆదివారం సాయంత్రం ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. స్థానికులు, క్షతగాత్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా గణపవరం మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన వై.బాలకృష్ణమోహన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అతని సోదరి బొడ్డు సత్యరమ్య, బావ అప్పలస్వామి, మేనకోడళ్లు తన్విత, దహన్వీలతో కలిసి తుని తలుపులమ్మలోవలో పండగకు బంధువుల ఇంటికి వచ్చారు. సాయంత్రం వరకు లోవలో సరదాగా గడిపారు. విశాఖలో ఉన్న పిన్నికి కృష్ణమోహన్ ఫోన్ చేసి వస్తున్నట్టు తెలిపారు. దీంతో పిన్ని పంపిన కారులో తలుపులమ్మలోవ నుంచి విశాఖ బయలుదేరారు. మార్గమధ్యంలో అనకాపల్లి జాతీయ రహదారిలో ఆగి ఉన్న లారీని కృష్ణమోహన్ కారు వెనక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలకృష్ణమోహన్ ఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యాడు. కాగా డ్రైవర్ జగదీష్‌తో పాటు చెల్లి సత్యరమ్య, బావ అప్పలస్వామి, మేనకోడళ్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శ్రీను ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కుటుంబసభ్యులు ఇంకా రాకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు.

తెలంగాణ మద్యం పట్టివేత

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం తాటాకుల గూడెం చెక్‌పోస్టు వద్ద ఆదివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న 92 మద్యం బాటిళ్లను అధికారులు పట్టివేశారు. ఈ ఘటనలో అశ్వారావుపేటకు చెందిన వెంకట సత్యనారాయణను అదుపులోకి తీసుకుని మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బాలాజీ స్థానిక విలేకరులకు చెప్పారు. వాహనం సీజ్ చేసి జంగారెడ్డిగూడెం ఎస్‌హెచ్‌ఓ కార్యాలయానికి తరలించారు.

మామిడి.. ధర తడబడి

- పేరుకే మధుర ఫలం.. రైతుకు దినదిన గండం
- రూ.5 వేలకు పతనమైన బంగినపల్లి టన్ను ధర
- వర్షాలతో తెగుళ్లు సోకి తగ్గిన కాయల నాణ్యత
- వ్యాపారుల సిండికేట్‌తో దక్కని గిట్టుబాటు ధర


నూజివీడులో ఎగుమతి కోసం సిద్ధంగా ఉన్న కలెక్టర్ రకం మామిడి కాయలు

నూజివీడు: ఏఏటికాయేడు తీపి లాభాలను పంచుతుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్న మామిడి రైతుకు మామిడి చేదునే రుచి చూపిస్తోంది. ఈ ఏడాది ఓవైపు అకాల వర్షాల వల్ల తెగుళ్లబారిన పడటం, మరోవైపు సేట్‌ల సిండికేట్ వల్ల ధర లేక రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ ఏడాదైనా పరిస్థితి బాగుంటుందనే ఆశాభావంతో మామిడి రైతు ముందుకు సాగుతున్నప్పటికీ పరిస్థితుల్లో మార్పు రాకపోగా మరింత సంక్షోభంలో కూరుకుపోతున్నాడు. ఈ ఏడాది మామిడి కాపు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. దీంతో మామిడి రైతులు తీవ్ర నిరాశనిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలో 60 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. నూజివీడు డివిజన్‌లోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, లింగపాలెం మండలాల్లో తోటలు ఎక్కువగా ఉన్నాయి. మామిడి కాయ కాపు ఒక ఏడాది బాగుంటే మరో ఉండదు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది మామిడి కాపు గతేడాది కంటే తక్కువగానే ఉంది. బంగినపల్లి, తోతాపురి (కలెక్టర్), రసాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. కాపు 30 నుంచి 40 శాతం లోపు మాత్రమే ఉండటంతో మామిడికి సీజన్ ప్రారంభంలో మంచిధర లభిస్తుందని రైతులు ఆశించారు. మార్చి, మే మొదటి వారంలో కురిసిన వర్షాలకు మామిడికి మసిమంగు, రాతిమంగు ఉధృతంగా ఆశించి కాయల నాణ్యత పడిపోయింది. నాణ్యత పడిపోవడం, సేట్‌లు సిండికేట్ కావడంతో ధర పతనమైంది.

చరిత్రలోనే లేనివిధంగా పడిపోయిన బంగినపల్లి ధర

సీజన్ ప్రారంభమైన ఫిబ్రవరి చివరి వారం, మార్చి మొదటి వారంలో బంగినపల్లి రకం కాయలకు టన్నుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ధర లభించింది. అయితే రానురాను ధర తగ్గుముఖం పట్టి టన్ను రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పడిపోయింది. అకాల వర్షాల తరువాత బంగినపల్లి ధర రోజురోజుకు పతనమై ప్రస్తుతం టన్ను రూ.5 వేల నుంచి రూ.6వేలకు దిగజారింది. దీంతో కోత ఖర్చులు, మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. బంగినపల్లి పరిస్థితి ఇంత దారుణంగా పడిపోవడం చరిత్రలోనే లేదని రైతులు చెబుతున్నారు. ఇకపోతే తోతాపురికి మాత్రం బంగినపల్లి కంటే అధిక ధర లభిస్తోంది. సీజన్ ప్రారంభంలో టన్నుకు రూ.10 వేల వరకు ధర పలకగా, అది క్రమేణా పెరిగి ఇటీవల వరకు రూ.16 వేల వరకు ధర లభించింది. అయితే గత వారం నుంచి పతనమై ప్రస్తుతం రూ.12 వేలకు పడిపోయింది. సీజన్ ప్రారంభంలో రూ.25 వేల ధర లభించినప్పటికీ అది క్రమేణా దిగజారి రూ.8 వేల నుంచి రూ.12 వేల మధ్య పలుకుతోంది.

అకాల వర్షాల వల్ల నష్టాలు



అకాల వర్షాలు మామిడి పంటను తీవ్రంగా దెబ్బతీసింది. ఈ వర్షాల వల్ల మసిమంగు, రాతిమంగు తెగుళ్లు ఆశించి మామిడి నాణ్యత పడిపోయింది. దీనికి తోడు వ్యాపారులు సిండికేట్ కావడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ధర పతనమైంది. ఇంతటి దారుణమైన పరిస్థితులను రైతులు ఎప్పుడూ ఎదుర్కోలేదు.

– పల్లె రవీంద్రరెడ్డి, మామిడి రైతు, నూజివీడు

క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల కలయిక

తణుకు టౌన్ : తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990 నుంచి 1995 సంవత్సరం వరకూ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థులకు బోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

శ్రీఆంజనేయం.. భజేహం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం వివిధ ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో వేంచేసియున్న అభయాంజనేయస్వామి వారికి తమలపాకులతో గంధం, సింధూరాలతో అర్చనలు చేశా రు. రామచంద్రరావు పేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో క్షేత్రపాలకుడు భక్త ఆంజనేయ స్వామికి పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో ఏకాదశ అభిషేకాలు నిర్వహించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు నేతృత్వం వహించారు. సీతారాంపేట రామాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ స్వామి వారిని దర్శించి పూజలు జరిపారు. హౌసింగ్‌బోర్డు దక్షిణముఖ హనుమాన్, సువర్చల సుందర హనుమాన్ ఆలయం వద్ద ఉదయం నుంచి విశేష పూజలు జరిపారు. మన్యుసూక్త సహిత ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి నవగ్రహ హోమం, సింధూరార్చనలు నిర్వహించారు. భక్తులచే హనుమాన్ పతాక యాత్ర పట్టణంలో నిర్వహించారు.



అత్తిలిలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించిన దృశ్యం



శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో భక్త ఆంజనేయస్వామి

సువర్చలా సమేత ఆంజనేయస్వామి వారి కల్యాణం నిర్వహించారు.

అత్తిలి: హనుమద్ జయంతి పురస్కరించుకుని అత్తిలి పంచముఖ ఆంజనేయస్వామివారిని పుష్పాలు, తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. దాసాంజనేయస్వామివారి ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. పాలూరు డ్యాం దగ్గర ఉన్న ఆంజనేయస్వామివారికి అభిషేక పూజలు చేశారు. బల్లిపాడు శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలతోపాటు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆరవల్లి గ్రామంలో స్వామివారికి రుద్రాభిషేకం, తమలపాకులతో సింధూర పూజలు జరిపారు.

తేతలిలో శోభాయాత్ర

తణుకు టౌన్ : మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తేతలిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ అర్చకులు మాతా ఉత్సవ కమిటీ సభ్యులు క్రాంతి, మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు. తణుకు పట్టణంలోని పిల్ల కాలువ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వావిలాల సర శాదేవి, వెంకట రమేష్, కోన మునేశ్వరావు, ఎం సంతోష్, రావూరి శ్రీను పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

తణుకు అర్బన్ : కారుమూరి సేవా సమితి ఆధ్వర్యంలో యువనేత కారుమూరి సునీల్‌కుమార్ ఆదివారం క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. సరెళ్ల వీరతాత, క్రీడాకారులు పాల్గొన్నారు.

నీతి కథల పఠనంతో నైతిక విలువలు

అత్తిలి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులచే నీతి కథలను చదివించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయిని కె సౌమ్య విద్యార్థులకు మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు పద్యాలు, శ్లోకాలపై, అమ్మ గొప్పదనంపై అవగాహన కల్పించారు. కేరమ్, చెస్ పోటీలు నిర్వహించారు. నీతికథల పఠనంతో విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకుంటారని, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు అన్నారు. కార్యక్రమంలో జి. నాగేశ్వరరావు, గంధం శేషవేంద్రరావు, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు చదివించారు. గ్రంథాలయాధికారి సత్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు పద్యాలు, నీతి కథలు, హిందీ, దేశభక్తి గీతాలు నేర్పించారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఎన్.సాల్మన్‌రాజు, మహాశివభట్టు లక్ష్మణరాజు, ఎ.జనార్ధనరావు, ప్రత్తి వీరాస్వామి విదార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

వృద్ధులకు 'సంచార' వైద్య సేవలు

తణుకు టౌన్ : తణుకు పట్టణం, పాతూరు, కే.సావరం గ్రామాల్లో ఆదివారం సంచార వైద్యశాల ద్వారా వైద్య సేవలు అందించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 8 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ వైద్య సేవలు అందించారు. సంఘ సభ్యులు ఎంవీఎస్ చలపతిరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్, కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృమూర్తులకు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలోని సత్యవతి నగర్ ఉమర్ ఆలీషా ఆశ్రమంలో ఆదివారం మాతృ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువులు కరిబండి రామకృష్ణ, బడుగు చంద్రశేఖర్, చిక్కాల అంబిక, సుభద్ర గుప్తా తదితర యోగా సాధకుల సమక్షంలో 15 మంది మాతృమూర్తులను సత్కరించారు. వక్తలు అమ్మ అనుబంధం తదితర విశేషాలను వివరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో.. కనిపించే దైవం అమ్మా అని లయన్స్ క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎంవీ రమణారావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పేరిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. మాతృమూర్తులకు సత్కారం చేశారు. వక్తలు మాట్లాడుతూ తల్లి మొదటి గురువు అన్నారు. క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.